విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

టీడీపీ ముఖ్య నేతల అడ్డాలపై దృష్టి

విశాలాంధ్ర బ్యూరో- ఏలూరు: వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి జగన్ సరికొత్త ఒరవడికి శ్రీకారం చుడుతున్నారు. రెండవసారి అధికారమే లక్ష్యంగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో అనేక వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఎన్నికలు మరో ఆరు మాసాలు మాత్రమే ఉన్న నేపథ్యంలో కేడర్ కు అనేక సంకేతాలు ఇస్తున్నారు. గ్రామస్థాయి కార్యకర్త నుంచి ఎమ్మెల్యే స్థాయి వరకు మార్గదర్శకాలు జారీ చేస్తున్నారు. వైసిపి అధిష్టానం అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా టిడిపి ముఖ్య నేతల అడ్డాలపై గురి పెట్టారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో టిడిపి సీనియర్ నేతల సెగ్మెంట్ లపై ప్రధానంగా దృష్టి సారించారు. టిడిపి ప్రధాన నేతలు పోటీ చేస్తున్న, చేయబోయే నియోజకవర్గాలను పరిగణనలోకి తీసుకుని ఆయా సెగ్మెంట్లపై ఏ విధంగానైనా వైసీపీ జెండా ఎగర వేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు.ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఉండి శాసనసభ్యులు మంతెన రామరాజు, పాలకొల్లు నిమ్మల రామానాయుడు, దెందులూరు నుండి చింతమనేని ప్రభాకర్, ఉంగుటూరు నుండి టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు ఏలూరు నుండి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఈ నియోజకవర్గాలలో వైసీపీ జెండా ఎగిరే విధంగా వ్యూహాత్మకంగా వెళ్లాలని ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలకు, ఇన్‌చార్జిలకు సూచించినట్లు తెలుస్తోంది. వైసీపీ బలహీనంగా ఉన్న నియోజకవర్గాలను గుర్తించి ఆయా ప్రాంతాలను బలోపేతం చేసేలా జిల్లా కోఆర్డినేటర్లను రంగంలోకి దించుతున్నారు. ఇప్పటికే సమావేశాలు నిర్వహించిన కోఆర్డినేటర్లు బలోపేతం దిశగా ప్రణాళికలు రచిస్తున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల మదిలో : క్షేత్రస్థాయి నుండి పట్టణ స్థాయి వరకు ప్రజల మదిలో ఉండేందుకు వైసిపి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో గ్రామ గ్రామాన సభలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలు ఎన్నికలు అయిపోయేంతవరకు వైసీపీ క్యాడర్ ప్రజల వెంటే ఉంటుంది. నిత్యం ఎమ్మెల్యేలు ప్రజల మధ్యనే ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

సమస్యల సెగ్మెంట్లకు కోఆర్డినేటర్లకు అప్పగింత : జిల్లాలో కొన్ని సమస్యలు ఉన్న సెగ్మెంట్లను రీజనల్ కోఆర్డినేటర్లకు అప్పజెప్పాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అక్కడ అసంతృప్తి నేతలతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించినట్లు సమాచారం. ఒకవేళ సమస్యలు పరిష్కారం కాకపోతే నేరుగా తన దగ్గరకు తీసుకురావాలని జగన్ ఆదేశించినట్లు వైసీపీ నాయకులు తెలుపుతున్నారు. సమస్యలు జఠిలంగా ఉంటే నచ్చజెప్పి చూడాలని, వినకపోతే పార్టీ చర్యలు తీసుకుంటుందని ఈ విషయంలో రాగద్వేషాలకు ఎవరైనా అతీతులు కారని హెచ్చరిస్తున్నారు.

దసరా తర్వాత నియోజకవర్గాల వారీగా సమీక్షలు : దసరా పండుగ తర్వాత నియోజకవర్గాల వారీగా సమీక్షలు ఏర్పాటు చేయనున్నట్లు నాయకుల వ్యాఖ్యానాలు వినపడుతున్నాయి. అనేక అంశాలను పరిగణనలోకి తీసుకొని ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహాలను తెలియజేయాలని సన్నద్ధం అవుతున్నారు. ఇప్పటికే గడపగడప సమీక్షలు అనేక అంశాల ప్రస్తావన జరిగిందని ఎన్నికలు పూర్తయ్యేంత వరకు ప్రజల వెంట ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని దిశా నిర్దేశం చేస్తున్నారు.

మునగ ఆకుతో రక్తహీనత నివారణ

జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో 4వేల మునగచెట్లు పెంపకం

విశాలాంధ్ర బుట్టాయిగూడెం: జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో, పాఠశాలల్లో 4వేల మునగ మొక్కలను నాటుతున్నట్లు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ తెలిపారు. బుధవారం బుట్టాయిగూడెంలోని అంగన్ వాడీ కేంద్రంలో మునగ మొక్కలను జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ నాటి జిల్లాలో 4వేల మునగ చెట్లు పెంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునగ చెట్టులోని ప్రతి భాగం ఉపయోగపడుతుందని శాస్త్రీయంగా విశ్లేషించినట్టు తెలిపారు. మునగలో విటమిన్ సి, మాంసకృత్తులు, ఐరన్, పొటాషియం అధికంగా ఉంటాయన్నారు. మునగ ఆకులు రక్తహీనతను నివారించడంతోపాటు ఎన్నో పోషకవిలువలు కలిగి ఉన్నాయన్నారు. ఈ మొక్కలను పాఠశాలల్లో పెంచి సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మునగ ఆకుల వినియోగంతో అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణీలు, మహిళలు, పిల్లలు, తమ పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులకు రక్తహీనత, పౌష్టికాహార లోపాన్ని తొలగించవచ్చన్నారు. కలెక్టర్ వెంట ఐటిడిఏ పిఓ యం. సూర్యతేజ, డిఎంహెచ్ఓ ఎస్. డా. శర్మిష్ట, ఐసిడిఎస్ పిడి విజయలక్ష్మీ, జెడ్పి సిఇఓ కె. రవికుమార్, డిఇఓ శ్యామ్ సుందర్, తహాశీల్దారు ఎస్.ఎస్. శాంతి, యంపిడిఓ వేణు గోపాల్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్‌కు బుధవారం జాయింట్ కలెక్టర్ బి. లావణ్య వేణి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి పూల మొక్కను అందజేశారు. కలెక్టర్‌కు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించి, ఎల్లప్పుడూ సంతోషంతో కూడిన జీవితాన్ని అందించాలని ఆకాంక్షించారు. జిల్లాలోని వివిధ శాఖల జిల్లా అధికారులు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈసందర్భంగా తనకు వ్యక్తిగతంగా ,వివిధ మాధ్యమాల ద్వారా శుభాకాంక్షలు తెలిపిన అందరికీ జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ధన్యవాదాలు తెలిపారు.

అధ్వాన్నంగా రహదారులు

విశాలాంధ్ర - కలిదిండి: మండలంలో రహదారులు అధ్వాసంగా ఉన్నాయి. రహదారులపై గుంతలు ఏర్పడి కొద్దిపాటి వర్షానికే గుంతలు కనపడని పరిస్థితి ఏర్పడింది. రహదారులపై గుంతలు ఏర్పడడంతో వర్షపు నీరు చేరి గుంతలు కనబడడంలేదు. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కలిదిండి-తాడినాడ, పడమట పాలెం- లోడిద లంక, కాళ్ల పాలెం అడ్డరోడ్డు - తాడినాడ, యడవల్లి - పెద లంక, గుర్వా పాలెం - మూలలంక రహదారులు అధ్వాసంగా ఉన్నాయి. నిత్యం వాహనాలతో ఉండే రహదారి గుంతల వల్ల లారీలు, బస్సులు గుంతలలో దిగిపోయి బయటికి రావడంలేదు. ఈ రహదారిలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరం

విశాలాంధ్ర - గణపవరం: ప్రతి పేదవాడికి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం వరం లాంటిదని ఉంగుటూరు శాసన సభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని గణపవరం 3 సచివాలయం పరిధిలో జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు ఈ వైద్య శిబిరంలో వైద్య సేవలు పొందవచ్చునని, గర్భిణులు, బాలింతలు చిన్నపిల్లలు కంటి పరీక్షలు దీర్ఘ కాలిక వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. అనంతరం మెడికల్ క్యాంపు నిర్వహణను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మూరా అలంకారం, దండు రాము, వైస్ ఎంపీపీ సలాది రత్న దుర్గా కుమారి, ఎంపీడీవో గద్దల జ్యోతిర్మయి, పిహెచ్ సి వైద్యాధికారులు డాక్టర్ సంతోష్ నాయుడు, కిరణ్మయి, సిహెచ్ఓ జె విల్సన్ బాబు,రొంగలశ్రీను, బత్తి సీతామాలక్ష్మి,తాడేపల్లిగూడెం ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ ఎం దివ్య రెడ్డి, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టివేత

విశాలాంధ్ర-లింగపాలెం: చింతలపూడి నుంచి లింగపాలెం మీదుగా అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యానును సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు. 3వేల కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని తరలిస్తున్న వ్యానును సీజ్ చేసి పోలీస్ స్టేషన్లోఅప్పగించారు. ఈ దాడిలో విజిలెన్స్ ఎస్ఐ రంజిత్, సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ జరీనా , సిబ్బంది పాల్గొన్నారు. తరలిస్తున్న కుమార్ నాగరాజు, దుర్గారావులపై కేసు నమోదు చేశారు.

సర్పంచ్‌పై దాడి : పోలీసులకు ఫిర్యాదు

విశాలాంధ్ర-లింగపాలెం: కే గోకవరంలో ప్రజలకు మంచినీటి సరఫరా చేసే పైపులైను పగులగొట్టిన వ్యక్తి తనపై దాడికి ప్రయత్నించాడంటూ సర్పంచ్ ఎలమంచి శ్రీనివాస్ ఎంపీడీవో ఆశీర్వాదానికి ఫిర్యాదు చేశారు. సర్పంచ్ ఇచ్చిన ఫిర్యాదును పోలీసులకు పంపారు. గ్రామంలో 4 వేలమందికి సరఫరా చేసే మంచినీటి పైపులైనును పగలగొట్టిన ఎ. రాఘవను సర్పంచ్ ప్రశ్నించగా తన పైకి కత్తితో దాడి చేసేందుకు ప్రయత్నించాడని సర్పంచ్ ఆరోపించారు. ప్రజలకు ఇబ్బంది కలిగేలా ఈ వ్యక్తి ప్రవర్తిస్తున్నాడని దీనివల్ల పంచాయతీలో అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని సర్పంచ్ పేర్కొన్నారు. ఇతనిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును పరిగణలోకి తీసుకొని దాడికి ప్రయత్నించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీవో వెల్లడించారు.

మొదలైన క్రికెట్ ఫీవర్

విశాలాంధ్ర-లింగపాలెం : క్రికెట్ వరల్డ్ కప్ మొదలవ్వడంతో పల్లె ప్రాంతాల నుంచి గ్రామీణ పట్టణ ప్రాంతాలలో క్రికెట్ ఫీవర్ అలముకుంది. టీవీలలో క్రికెట్‌ను వీక్షించేందుకు సన్నాహాలు చేసుకున్నారు.దీనికోసం పందెంరాయుళ్లు కౌంటర్లను తెరిచారు. భారీగా బెట్టింగులకు సన్నాహాలు చేసుకున్నారు.

యువత పోరాట పటిమను అలవరచుకోవాలి

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: నేటి యువత పోరాట పటిమ కలిగి ప్రజా ఉద్యమాలలో ముందుకు సాగాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయం వద్ద అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మండల మహాసభ కొత్తూరి రాజు అధ్యక్షతన జరిగింది. ముందుగా ఏఐవైఎఫ్ జెండాను సంఘ పూర్వ సభ్యులు జేవి రమణ రాజు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో కృష్ణచైతన్య మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో నాటి సుఖదేవ్ ,రాజ్ గురు, భగత్ సింగ్ వంటి ఎంతోమంది యువకులు స్వాతంత్ర ఉద్యమంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అలుపెరిగిన పోరాటం చేశారన్నారు. నేటి యువకులు కూడా వారిని ఆదర్శంగా తీసుకుని రాజకీయ, సామాజిక చైతన్యం కలిగి ఉండాలన్నారు. నేటి ప్రభుత్వాలు యువతను అశ్రద్ధ చేస్తూ, ఇచ్చిన హామీలను పట్టించుకోక పోవడం వల్ల ఎంతోమంది నిరుద్యోగ యువతీ యువకులు ఒక చేత డిగ్రీ పట్టా పట్టుకొని, మరో చేత పొట్ట పట్టుకుని ఉద్యోగాల కోసం పరుగులు పెడుతూనే ఉన్నారన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా నేటి యువతకు విద్య, ఉద్యోగ ,ఉపాధి సాధనకై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ఏలూరు జిల్లా కన్వీనర్ చాకిరి సురేష్,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొలిమే బాలయేసు,యువతీ యువకులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

- జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి

విశాలాంధ్ర-తణుకు: 50 శాతం సబ్సిడీ రుణాలను వినియోగించుకోవాలని, దగ్గరలో ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు వివరాలు పొందవచ్చని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. రామ సుందర్ రెడ్డి అన్నారు. జాతీయ లైవ్ స్టాక్ మిషన్ కార్యక్రమానికి సంబంధించి బుధవారం స్థానిక నెక్ కల్యాణమండపం నందు పశ్చిమగోదావరి జిల్లా రైతులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రామ సుందర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ముందుగా రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు జ్యోతి ప్రజలను చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని గొర్రెలు మేకలు, కోళ్లు, పందులు పెంచుకునే రైతు సోదరులు ఈ మిషన్ ఉపయోగించుకుని వారి ఆర్థిక పరిస్థితిని పెంచుకోవాలన్నారు. అన్ని బ్యాంకుల వారు పూర్తిగా సహకరించి రైతు సోదరులందరికీ విరివిగా రుణాలు మంజూరు చేయాలని కోరారు. డాక్టర్ మాదిన ప్రసాద్ రావు, డాక్టర్ వాణి ప్రసాద్ లు రైతు సోదరులందరికీ జాతీయ లైవ్ స్టాక్ మిషన్ గురించి వివరిస్తూ రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు డాక్టర్ కె. మురళీకృష్ణ, డాక్టర్ ఎల్. కె సుధాకర్, డాక్టర్ జె హుస్సేన్, దాసరి హైమావతి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహారదీక్షలు

విశాలాంధ్ర-తణుకు: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఎటువంటి ఆధారాలు లేకుండా చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి రాజమండ్రి సెంట్రల్ జైల్‌కు రిమాండుకు తరలించడాన్ని నిరసిస్తూ తణుకు నియోజకవర్గ నాయకులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 22 వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నాయకులకు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్ నల్ల కండువా కప్పి దీక్షను ప్రారంభించారు. అనంతరం అత్తిలి మండల తెదేపా అధ్యక్షులు అనాల ఆదినారాయణ మాట్లాడుతూ చంద్రబాబును అక్రమ కేసులో రిమాండ్‌కు పంపి వైయస్ జగన్ వైసిపి ప్రభుత్వం చేస్తున్న చర్యలకు నిరసనగా తణుకు తెదేపా ఆధ్వర్యంలో బాబుకి అండగా బాబు తోనే మేము నినాదంతో బుధవారం రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు బసవ రామకృష్ణ, తణుకు పట్టణ అధ్యక్షులు కలగర వెంకట కృష్ణ ఇరగవరం మండల పార్టీ అధ్యక్షులు గోపిశెట్టి రామకృష్ణ, మండల సెక్రెటరీ బొంతు శ్రీను, అత్తిలి మండల సెక్రెటరీ, కోరుపల్లి హరి, చట్టాల పార్వతి మల్లిన రాధాకృష్ణ, పూతినీడి శ్రీనివాస్, అడ్డ సాయిబాబా, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకట్రావు, సుబ్రహ్మణ్యం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు కె.విఘ్నేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇటీవల జంగారెడ్డిగూడెం పట్టణంలోని శ్రీసీతారామ కళ్యాణ మండపంలో జరిగిన మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ మహా సభలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగినట్లు ఆయన తెలిపారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షుడిగా కంతేటి వెంకట్రావు, ఉపాధ్యక్షుడిగా దోసూరి పెద నాగరాజు, కార్యదర్శిగా నిమ్మల సుబ్రహ్మణ్యం,సహాయ కార్యదర్శిగా మండల అప్పలస్వామి, కోశాధికారిగా వెల్లంకి దుర్గా ప్రసాద్,కమిటీ సభ్యులుగా దోసూరి చిన నాగరాజు, మోటుమర్రి బాలు తదితరులు ఎన్నికైనట్లు విఘ్నేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భజంత్రీ శ్రీనివాస్ నూతన కమిటీని అభినందించారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నూతన కమిటీ అలుపెరుగని కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జె.వి.రమణ రాజు, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అయితా సురేష్,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొలిమే బాల యేసు, ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి బొక్కా శ్రీనివాసరావు,జంగారెడ్డిగూడెం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కొత్తూరి నాగేశ్వర రావు,రేలంగి నాగరాజు,ముత్యాలరావు, దుద్దే మునలయ్య, బొక్కా సూర్య చంద్ర రావు,ముప్పిడి రాంబాబు,కన్నూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వేల్పుల నాగేశ్వరరావుకు సత్కారం

విశాలాంధ్ర -భీమవరం: గౌరవ డాక్టరేట్ స్వీకరించిన ప్రముఖ రచయిత, తెలుగు ఉపాధ్యాయులు వేల్పుల నాగేశ్వరరావును శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో బుధవారం ఏ.ఆర్ .కే.అర్. మున్సిపల్ హైస్కూల్లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ సమాజంలో సేవలు అందించే వారికి ఎక్కడైనా గుర్తింపు వస్తుందని, రచనల్లో ఒక ఒరవడి సృష్టించిన వేల్పుల నాగేశ్వరరావు అనేక అవార్డులు పొందారని ప్రశంసించారు. గాంధీ జయంతి సందర్భంగా విజయవాడలో ఠాగూర్ గ్రంథాలయంలో జరిగిన సభలో దుగ్గిరాల పద్మశ్రీ గుర్రం జాషువా సంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు పెద్దేటి యోహన్, వీర వనిత ఝాన్సీ లక్ష్మీబాయి, కుటుంబ సభ్యురాలు సాందేలు శాంతి బాయి చేతులమీదుగా డాక్టరేట్ అందుకోవడం గర్వకారణమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి మల్లుల సీతారాం ప్రసాద్ మాట్లాడుతూ వేల్పుల నాగేశ్వరరావు గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ భాషా సంస్కృతిక అధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్ర భారతిలో మహాకవి రావూరి భరద్వాజ చేతుల మీదుగా శ్రీశ్రీ స్మారక అవార్డును అందుకున్నారని తెలిపారు. కళా రంజని నాటక పరిషత్ అధ్యక్షులు జవ్వాది శ్రీనివాస్, ప్రజా నాట్య మండలి సభ్యులు ఎస్ కే చాన్ భాషా మాట్లాడుతూ నాగేశ్వరరావు రచించిన అంబేద్కర్ నాటకానికి దేశంలోనే ఎనలేని గుర్తింపు వచ్చిందని, రాయలసీమ యూనివర్సిటీ ఆయన రచించిన నాటకాన్ని ఎంఏ విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చడం గొప్ప విశేషమని అన్నారు. సన్మాన గ్రహీత వేల్పుల నాగేశ్వరరావు మాట్లాడుతూ నా రచనలకు అభిమానులు అందిస్తున్న స్పందనే ఈ గుర్తింపుకు కారణమని అన్నారు. డాక్టరేట్ తనకు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. హైస్కూల్ హెచ్ఎం ఎ.సత్యనారా యణమూర్తి, సోమేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారులకు గుర్తింపు కార్డులు

విశాలాంధ్ర -భీమవరం: రంగస్థల కళాకారులకు రాష్ట్ర సమాచార శాఖ ఇస్తున్న గుర్తింపు కార్డులకు జిల్లాలోని కళాకారులందరు దరఖాస్తు చేసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్ కోరారు. బుధవారం ఆయన భీమవరంలో మీడియాకొక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో దరఖాస్తులు పూర్తి చేసి ఇచ్చే కార్యక్రమం చేపట్టామని, కళాకారులు తమ ఆధార్ కార్డ్ జిరాక్స్, ఆధార్‌కు లింకైన ఫోన్ నెంబరు, బ్లడ్ గ్రూపు కాపీ, ఈ మెయిల్ ఐ. డి., ప్రదర్శనల ఫొటో, పాస్ పోర్ట్ ఫొటో తీసుకుని భీమవరం ఎల్ఐసి ఆఫీస్ రోడ్డులోని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో 5 వ తేదీ ఉదయం 10 గం. నుండి సా. 5 గం. తమతో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. సమాచార శాఖకు 7వ తేదీ లోపు దరఖాస్తులు అందచేయాలని మరిన్ని వివరాలకు సెల్ నెం. 7382729337 సంప్రదించాలని ఈ అవకాశాన్ని జిల్లాలోని సాంఘిక, పౌరాణిక, చారిత్రాత్మక కళాకారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

భూరక్ష పథకంపై గ్రామసభ

విశాలాంధ్ర- ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామపంచాయతీ కమ్యూనిటీ హాల్లో జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకంపై బుధవారం గ్రామసభ నిర్వహించారు. మండల సర్వేయర్ పి. శ్రీనివాస్ మ్యాపు ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సభకు సర్పంచ్ బందారు సింధు అధ్యక్షత వహించారు. ఉంగుటూరు తహసీల్దార్ రమణారావు కార్యక్రమాన్ని ప్రారంభించి వెళ్లిపోయారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డి షేక్ షంషీద్దీన్, విఆర్వో కిరణ్, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **KSHATRIYA RATNA (NEW NAME), W/o KSHATRIYA HANUMAN SINGH,** Previously called **RAJANALA RATNA (OLD NAME),** H.No.12-15-44, Bantrothula vari Street, Gunupudi, Bhimavaram, Bhimavaram Mandal, W.G.Dist, A.P. Now Changed my name from **RAJANALA RATNA (OLD NAME) to KSHATRIYA RATNA (NEW NAME)** Today onwards Use my New Name for all further Transactions.

CHANGE OF NAME

I, **MOHAMMAD ASMATARA (NEW NAME), W/o MOHAMMAD SHAFIUDDIN,** Previously called **MOHAMMAD ASMATHARA (OLD NAME),** Resident of H.No.18-7-6/2, Behind Big Mosque, Bhimavaram, Bhimavaram Mandal, W.G.Dist, A.P. Now Changed my name from **MOHAMMAD ASMATHARA (OLD NAME) to MOHAMMAD ASMATARA (NEW NAME)** Today onwards Use my New Name for all further Transactions.

CHANGE OF NAME

I, **TALLURI VENKATESU** (Old Name), S/o. TALLURI KONDAYYA, R/o. D.No.26-39/2, Supriyanpet, Chintalapudi Post and Mandal, West Godavari District - 534460, Andhra Pradesh, have changed my name to **TALLURI VENKATESH.** Hereafter my name is known as **TALLURI VENKATESH.**

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర-పోడూరు: జగనన్న కాలనీలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు వెంటనే పూర్తి చేసుకునేలా చూడాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి లబ్ధిదారులకు, అధికారులకు, స్థానిక నాయకులకు సూచించారు. పోడూరు మండలంలోని వేడంగి, కవిటం గ్రామాలలోని జగనన్న కాలనీలను జిల్లా కలెక్టర్ బుధవారం సందర్శించి పరిశీలించారు. కాలనీలలో ఇళ్ల వద్ద ఇంకుడు గుంటలు తవ్వుకోవాలని ఇంటి యజమానులకు సూచించారు. కాలనీలో రోడ్లపై నీరు నిలిచి ఉండటం గమనించిన జిల్లా కలెక్టర్ కాలనీలలో రోడ్లమీద నీరు నిలవకుండా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించారు. జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్ ,సర్పంచ్ సిహెచ్ శారద తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-మొగల్తూరు : రాష్ట్రవ్యాప్తంగా పేద ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్ రాజు కోరారు. బుధవారం మొగల్తూరు 2 పడమటిపాలెం గ్రామ సచివాలయం వద్ద జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యాధికారులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎంతమందికి వైద్య పరీక్షలు చేసారు... ఇంకా ఎంతమంది ఉన్నారు ఈ క్యాంపునకు వచ్చిన వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి సమస్యలు ఉన్న వారికి వైద్యం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పడమటి పాలెం సచివాలయం పరిధిలో 11 78, కుటుంబాలు వారు ఉండగా ఇంటింటికి వచ్చి పరీక్షలు చేసి 880, మందికి వివిధ లోపాలను గుర్తించి కూపన్లు ఇవ్వటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు తిరుమణి బాపూజీ, వైస్ ఎంపీపీలు కైలా సుబ్బారావు, కవురు సీతమాలక్ష్మి, సర్పంచ్ పడవల మేరీ సత్యనారాయణ, నాయకులు కర్రి ఏసుబాబు, మోటుపల్లి రామ తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐలలో 5వ విడత ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు కలెక్టరేట్ కార్యాలయ సమీపంలోని ప్రభుత్వజిల్లా స్థాయి శిక్షణ కేంద్రంలో ఐదవ విడత ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు సహాయ సంచాలకులు ఉగాది రవి తెలిపారు. 2023 - 2024 విద్యాసంవత్సరానికి గాను సంస్థలో సీట్ల భర్తీకి ఐదవ విడత కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈనెల 7 సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కాలేజీ పని వేళలలో ఆఫీస్ నందు సంప్రదించగలరన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ప్రభుత్వ జిల్లాస్థాయి శిక్షణా కేంద్రం, ఐటిఐ ఏలూరులో ఈనెల 9వ తేదీన నిర్వహించే కౌన్సిలింగ్‌కు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నంబర్ 833283694ను సంప్రదించాలని కోరారు.

మానవత్వం చాటిన సర్పంచ్

విశాలాంధ్ర - గణపవరం: ప్రతి మానవుడికి ఆపద వస్తుంది... ఆపద వచ్చినప్పుడు ఆదుకోవడమే మానవత్వం అవుతుంది. అలాంటి సంఘటన గణపవరం మండలం జల్లి కాకినాడ గ్రామంలో జరిగింది. జల్లికాకినాడ గ్రామానికి చెందిన బీర విజయ్ ప్రతాప్ కుమార్ అనారోగ్యంతో బాధ పడుతూ వైద్యం నిమిత్తం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కిమ్స్ హాస్పిటల్ ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. గామ సర్పంచ్ బాతు నాగేశ్వరరావు(నాగరాజు), స్వయంగా వెల్ఫేర్ అసిస్టెంట్ కిమిడి నాగ దుర్గా రావును దగ్గరుండి వెంటబెట్టుకుని మానవత్వంతో అమలాపురం వెళ్లి ప్రతినెల ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ అందజేసి పూర్తి ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని సర్పంచ్ కోరారు. సర్పంచ్‌ను ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు(వాసుబాబు), ఎంపీపీ దండు వెంకటరామరాజు (అర్ధవరం రాము), జెడ్పీటీసీ దేవరపు సోమలక్ష్మి, వైయస్సార్ పార్టీ మండల కన్వీనర్ దండు రాము, పలువురు అభినందించారు.

డేటాఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రధానమంత్రి కౌశల్ వికాశ్ యోజన క్రింద డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక డి.యల్.టి.సి,ఐ.టి.ఐ ప్రధానాచార్యుడు ఎస్.ఉగాది రవి ఒక ప్రకటనలో తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఆ పైన ఉత్తీర్ణులైన వారు 15 నుంచి 35 ఏళ్ల లోపు వారు అర్హులని తెలియజేశారు. ధరఖాస్తులు అందజేసేందుకు ఈనెల 10వ తేదీ చివరి తేదీ అని తెలిపారు. ఇతర వివరాలకు 9493482414 నెంబరులో సంప్రదించవచ్చన్నారు.

22వ రోజుకు చేరుకున్న టీడీపీ దీక్షలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : తెదేపా జాతీయ అధ్యక్షులు చంద్రబాబును విడుదల చేయాలని కోరుతూ పోలవరం నియోజకవర్గ పరిధిలో ఉన్న 7 మండలాల పార్టీ నాయకులు కార్యకర్తలు గత 22 రోజుల నుండి కొయ్యలగూడెం పట్టణంలో నిర్వహిస్తున్న సామూహిక నిరాహార దీక్షలో బుధవారం పాల్గొని సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు మొడియం శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు జేష్ఠ రామకృష్ణ, తేదేపా మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్, ఇంచార్జ్ బొరగం శ్రీనివాసరావు, మొడియం సూర్యచంద్రరావు, పారేపల్లి రామారావు, తెదేపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో గ్రామాలలో ఉండే ప్రజలంతా వైద్య నిపుణుల చేత వైద్య పరీక్షలు నిర్వహించుకుని ప్రభుత్వం ద్వారా ఇచ్చే ఉచిత మందులను తీసుకోవాలని ఎంపీపీ గంజిమల రామారావు, జడ్పిటిసి సభ్యురాలు దాసరి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మండలంలో పొంగుటూరు గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రత్యేకంగా వచ్చిన వైద్యులు గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు శిబిరం వద్ద నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ పసుపులేటి రాంబాబు, పిఏసిఎస్ అధ్యక్షులు మంతెన సోమరాజు, వైకాపాజిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలి

విశాలాంధ్ర-వీరవాసరం: ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆకాంక్షించారు. వీరవాసరం మండలం కొణితివాడ గ్రామ పంచాయతీ పరిధిలోని గవరపాలెంలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రజలతో మాట్లాడుతూ ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వైద్యానికి అధిక ప్రాధాన్యత కల్పించి వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో 3,500 వ్యాధులకు పైగానే కార్పొరేట్ ఆసుపత్రులలో ఉచితంగా వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ప్రజలకు వైద్యాన్ని మరింతగా దగ్గర చేసేందుకు వైయస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి స్థానికం గానే ప్రజలకు వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు. కొన్ని ప్రైవేటు ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ పథకం అమలులో ఉన్నప్పటికీ రోగులను తప్పుదోవ పట్టించి వారికున్న వ్యాధులు ఆరోగ్యశ్రీ పథకంలోకి రావడం లేదని, రోగుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నారని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు.

డాక్టర్ అవతారమెత్తిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ : గవరపాలెంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అక్కడున్న ప్రజలతో మాట్లాడారు. ఈ గ్రామంలో ఎక్కువ మందికి బీపీ, షుగర్ ఎక్కువగా ఉందని వైద్యులు చెబుతున్నారని, ప్రజలు పంచదార వాడకాన్ని, మసాలా వాడకాన్ని తగ్గించుకుంటే ఈ రెండు వ్యాధుల నుండి బయటపడవచ్చని సూచించారు. అదే మాదిరిగా 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని వెల్లడించారు. ఆయా కార్యక్రమాల్లో మండల కన్వీనర్ కడలి ధర్మారావు, ఏఎంసి చైర్మన్ కోటిపల్లి బాబు, మాజీ జడ్పిటిసిలు పోలిశెట్టి దాసు, మానుకోండ ప్రదీప్ కుమార్, సర్పంచ్ లు, అధికారులు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి

విశాలాంధ్ర-భీమడోలు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని ఏలూరు ఆర్డీవో ఖాజావలి పిలుపునిచ్చారు. బుధ వారం భీమడోలు హైస్కూల్ ఆవర ణలో విద్యార్థుల పేరున మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏలూరు ఆర్డీవో ఖాజావలి విద్యార్థులతో కలిసి 50 మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామయ్య, జడ్పిటిసి భవాని, సర్పంచ్ సునీత, తహసీల్దార్ ఇందిరాగాంధీ, ఎంపీడీఓ పద్మావతిదేవి తదితరులు పాల్గొన్నారు.

పేటీఎం సంస్థ క్యాంపస్ ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర - గణపవరం: పేటీఎం సంస్థ, మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జవహర్ నాలెడ్జ్ సెంటర్ గణపవరం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల ఆరవ తేదీన ఉద్యోగ మేళ నిర్వహిస్తున్నట్లు చింతలపాటి వరప్రసాద్ మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి బుధవారం తెలిపారు. ఈ ఉద్యోగ మేళాలో పేటీఎం సంస్థ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు, ఈ సంస్థలో సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు 26 సంవత్సరాలు లోపు వయస్సు కలిగి డిగ్రీ, ఇంటర్మీడియట్ పాసైన పురుష అభ్యర్థులు ఉద్యోగాలకు అర్హులని ఆమె తెలిపారు. నెలకు జీతం రూ. 16 వేలు, రూ. 6 వేలు బోనస్ ఇతర అలవెన్స్ లు ఉంటాయని ఆమె తెలిపారు. ఈనెల ఆరో తేదీన ఉదయం 10 గంటలకు డిగ్రీ కళాశాలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు ఈ సెల్ నెంబర్ 9866215054 కు సంప్రదించాలని తెలిపారు.

కొనసాగుతున్న టీడీపీ రిలే నిరాహారదీక్షలు

విశాలాంధ్ర -భీమవరం: చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ టిడిపి శ్రేణులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారం 26వ రోజుకు చేరు కున్నాయి. మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, భీమవరం నియోజకవర్గ పరిశీల కుడు రాష్ట్ర కార్యదర్శి దాసరి అంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, కృష్ణబలిజ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యుడు గంట త్రిమూర్తులు రిలే దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏపీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి తన తాత రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తూ రాష్ట్రాన్ని రావణకాష్టంగా తయారు చేశారని విమర్శించారు. కార్యక్రమంలో వీరవాసరం ఎంపీపీ వీరవల్లి దుర్గభవాని, టిడిపి నాయకులు సయ్యద్ నసీమాబేగం, ఎండి షబీనా, మాదాసు కనకదుర్గ, బి.పద్మ, గంధం రాధ, రేవు వెంకన్న, గూడూరి సుబ్బారావు, వీరవల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఆరోగ్యం

విశాలాంధ్ర-వీరవాసరం: దేవుని రాజ్యంలోకి ప్రవేశించండి అని జీసెస్ చెప్పింది ధ్యానమేనని ధ్యానం చేయడం ద్వారా జీవితంలో మంచి జరుగుతుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్స్ చెన్నా రాంబాబు, గారపాటి సత్యనారాయణలు తెలిపారు. స్థానిక తోటవీధి రామాలయం లో మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత ధ్యానశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కానూరు అగ్రహారం గ్రామానికి చెందిన పాల్గొని జ్ఞాన బోధ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధ్యానం అనేది మనలను మనకు పరిచయం చేసే ప్రక్రియ అని, కాయపుటూపిరిలో గని ఉందని, ఊపిరిలో దేవుడున్నాడని యోగీంద్రులకు అన్నమయ్య చెప్పినా, దేవుని రాజ్యం నీలోపలే ఉందన్నారు. అనంతరం భగవద్గీత శ్లోకాల లోని యోగార్థాలను, ధ్యాన విశిష్టతను తెలిపి అందరితో సామూహిక ధ్యానం చేయించారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ కె.వి.డి.ప్రసాద్, సన్నిధి ఉదయ్, యం.కృష్ణారావు, నాగరాజు, వర్రి కృష్ణవేణి, బి.దేవి.యర్రాయమ్మ సావిత్రి, కమల, ఆదిరెడ్డి గోపమ్మ, జామి పైడమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత

విశాలాంధ్ర- ఉంగుటూరు : పేదల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యతను ముఖ్యమంత్రి జగన్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం ఉంగుటూరు మండలం గోపాలపురం సచివాల యం పరిధిలో రామచంద్రపురంలో నిర్వహించారు. ఎంపీడీవో ప్రేమానువిత, డిప్యూటీ తాసిల్దార్ బొడ్డేపల్లి దుర్గాప్రసాద్, గ్రామ సర్పంచ్ గౌతు రాము, ఎంపీటీసీ శ్రీను,యర్రమిల్లి పాడు సర్పంచ్ శ్రీను, నల్లమాడు మాజీసర్పంచ్ రవి, సచివాలయాలు మండల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ పాల్గొన్నారు.

వారాహి యాత్రకు ముదినేపల్లిలో విస్తృత ఏర్పాట్లు

విశాలాంధ్ర -ముదినేపల్లి : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నిర్వహిస్తున్న వారాహి విజయయాత్ర ముదినే పల్లిలో నాయకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లపై జనసేన మండల పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకటేశ్వరరావు (వెంకయ్య) మాట్లాడుతూ పార్టీ అధినేత యాత్ర మండలంలోని ఈనెల 5న సింగరాయపాలెంలో రోడ్ షోతో ప్రారంభమై సాయంత్రం ఐదు గంటలకు ముదినేపల్లి గురజ రోడ్డు సెంటర్ కు చేరుకుని సభలో పాల్గొంటారు. ప్రధాన రహదారి పొడవున పవన్ కళ్యాణ్‌కు నాయకులు, అభిమానులు, కార్యకర్తలు స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ నాయకులు సిఏ బి వి రావు , మండల నాయకులు వేల్పూరి నానాజీ , అంబుల భరత్ , లంకపల్లి నాని పలువురు నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మాతా, శిశు మరణాల నివారణకు 'అక్షజ'

విశాలాంధ్ర- బుట్టాయిగూడెం: మాతా, శిశు మరణాల నివారణ లక్ష్యంగా గర్భిణీల్లో రక్తహీనతను నివారించేందుకు అక్షజ కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ తెలిపారు. బుధవారం స్థానిక యంపిడిఓ కార్యాలయంలో ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల, మార్పు సేవా సంస్థల సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా, శిశు మరణాల నివారణ లక్ష్యంగా గర్భిణీలలో రక్తహీనతను నివారిం చేందుకు 6 నెలల పాటు పౌష్టికాహార కిట్లను అందించడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో మహిళా శిశు సంక్షేమ శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన ఆర్. సూయిజ్, ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ నేతృత్వంలో ప్రోటీన్ కలిగిన పొడి, మునగాకులతో తయారుచేసిన లడ్డులతో కూడిన న్యూట్రిషన్ ప్యాకెట్లను పైలెట్ ప్రాజెక్ట్ గా గిరిజన మండలాలైన జీలుగుమిల్లి, టి. నర్సాపురం, బుట్టాయిగూడెం మండలాల్లో గర్భిణీ స్త్రీలకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గిరిజన ప్రాంతాల్లో గర్భిణీ మహిళల్లో రక్తహీనత మూలంగా డెలివరీ సమయంలో ఎన్నో ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు అక్షజ పౌష్టికాహార కిట్లను కలెక్టర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి,ఐటిడిఏ పివో యం. సూర్యతేజ, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ, మార్పు సేవా సంస్థ ప్రతినిధి ఆర్. సూయిజ్, సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, ఐసిడిఎస్ పిడి విజయలక్ష్మీ,ఆర్డిఓ ఝాన్సీరాణి, డిఇఓ శ్యామ్ సుందర్, జెడ్పి సిఇఓ కె. రవికుమార్, డిఎంహెచ్ ఓ డా. ఎస్. శర్మిష్ట, తహశీల్దారు ఎస్.ఎస్. శాంతి, యంపిడిఓ వేణగోపాల్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కలెక్టర్ పరిశీలన

విశాలాంధ్ర-బుట్టాయిగూడెం: బుట్టాయిగూడెం జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులను కలిసి రక్తహీనత, పౌష్టికాహార లోపం గురించి అడిగి తెలుసుకున్నారు. కళాశాల హాస్టల్‌లో మరో 150 మందికి అదనపు వసతికి డార్మెటరీ నిర్మాణానికి అనుమతి మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించాలని ఐటిడిఏ పివో యం. సూర్యతేజను ఆదేశించారు. అక్కడే స్కిల్ డెవలప్‌మెంట్ తరగతులను కలెక్టర్ పరిశీలించారు. శిక్షణ పొందుతున్న వారికి ఉద్యోగ అవకాశాలు పెంపొందించే విధంగా శిక్షణ ఉండాలన్నారు. శిక్షణ పొందుతున్న విద్యార్థినిలతో మాట్లాడుతూ వారు పొందుతున్న శిక్షణ కార్యక్రమ వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్ ఆఫీసు నేర్చుకున్నానని అది ఇప్పటికీ కూడా తనకెంతె ఉపయోగపడు తున్నదన్నారు. కలెక్టర్ వెంట జిల్లాజాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి, ఐటిడిఏ పివో యం. సూర్యతేజ, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ, ఆర్డిఓ ఝాన్సీరాణి, డిఇఓ శ్యామ్ సుందర్, జెడ్పి సిఇఓ కె. రవికుమార్, స్థానిక తహశీల్దార్ ఎస్.ఎస్. శాంతి, యంపిడిఓ వేణుగోపాల్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఇంటి ముంగిటకే పాలన

విశాలాంధ్ర- వీరవాసరం: ఇంటి ముంగిటకే ప్రభుత్వ పాలనను తెచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దేశంలోనే అత్యుత్తమ జననాయకుడిగా నిలిచారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొణితివాడ గ్రామ పంచాయతీ పరిధిలోని గవరపాలెంలో రూ.40 లక్షల నిధులతో నిర్మించిన నూతన సచివా లయ భవనాన్ని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంటే ప్రజలని వారికి పూర్తిస్థాయిలో ప్రభుత్వ సేవలు అందించాలంటే ఇంటి ముంగిటకే ప్రభుత్వ పాలన తీసుకెళ్లాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వాలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. దేశంలోనే ఒక వినూత్న పాలనతో ప్రజలకు మేలు జరిగే విధంగా పాలన చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రజల ఆశీస్సులు పూర్తిగా ఉన్నాయని అన్నారు. ప్రజలంతా జగన్ వైపే ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. అనంతరం సచివాలయ భవనానికి స్థలం దానంగా ఇచ్చిన దాత కుటుంబ సభ్యులైన బీశెట్టి కోటేశ్వరరావు, శ్రీనివాసులను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో మండల కన్వీనర్ కడలి ధర్మారావు, ఏఎంసి చైర్మన్ కోటిపల్లి బాబు, మాజీ జడ్పిటిసిలు పోలిశెట్టి దాసు, మానుకోండ ప్రదీప్ కుమార్, సర్పంచ్ లు, అధికారులు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నందమూరు సర్పంచ్ చెక్ పవర్ పునరుద్ధరణ

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నందమూరు గ్రామ సర్పంచ్ శనగన వరలక్ష్మి చెక్ పవర్ ను పునరుద్ధరిస్తూ జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఇటీవల గ్రామంలో మంచినీటి చెరువులో చేపల వేలం వేయకుండా అవకతవకలకు పాల్పడ్డారంటూ అందిన ఫిర్యాదు మేరకు గతంలో చెక్ పవర్‌ను రద్దు చేశారు. దీనిపై తమ తప్పు లేదని ప్రజల మంచినీటి అవసరాల నిమిత్తమే చెరువులు శుభ్రం చేశామని సర్పంచ్ వరలక్ష్మి ఉన్నతాధికారులకు వివరణ ఇచ్చారు. దీంతో జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఈ అంశంపై విచారణ జరిపి స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల మంచినీటి అవసరాల నిమిత్తం చెరువు శుభ్రం చేయడం జరిగిందని గ్రామస్తులు తెలపడంతో, సర్పంచ్ తప్పు లేదని వెంటనే చెక్ పవర్‌ను పునరుద్ధరించాలని డీపీవోను ఆదేశించడంతో చెక్ పవర్‌ను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వరలక్ష్మిని తెదేపా నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, సర్పంచులు ఛాంబర్ నాయకుడు పోతుల అన్నవరం, మండల టిడిపి అధ్యక్షుడు పరిమి రవికుమార్‌లు అభినందించారు.

జనసేనలో చేరికలు

విశాలాంధ్ర-తణుకు: జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలు ఆయన చేసిన సేవా కార్యక్రమాలు నచ్చి తణుకు నియోజకవర్గం లోని ఓగిడి గ్రామం, అయినపర్రు గ్రామం నుండి సుమారుగా 50 మంది జనసేన పార్టీలో చేరారు. అయ్యారు.వీరికి తణుకు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ విడివాడ రామచంద్రరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.అనంతరం ఓగిడి గ్రామంలో ఇంటింటికి తిరిగి పవన్ కళ్యాణ్ చేసిన సేవా కార్యక్రమాలు ఆయన ఆశయాలను ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇరగవరం మండలం పార్టీ అధ్యక్షుడు ఆకేటి కాశి, ఇరగవరం మండలం జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కైకరం హైస్కూల్లో వనమహోత్సవం

విశాలాంధ్ర - ఉంగుటూరు: ఉంగుటూరు మండలం కైకరం హైస్కూల్లో బుధవారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ సీ సీ స్కౌట్ విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమంలో ఉంగుటూరు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జడ్పిటిసి సభ్యురాలు జయలక్ష్మి, ఎంఈఓ శ్రీనివాస్, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు జి. ప్రసాదరావు, మానవతా రీజనల్ చైర్మన్ పుష్పాల గోపి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సర్గతులు సిద్ధించడమే మహాలయ పక్షం

విశాలాంధ్ర - అనపర్తి : మహాలయ పక్షాలు పురస్కరించుకొని అనపర్తి సనాతన ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో సనాతన ధర్మ పరిరక్షణ సమితి గ్రూపు సభ్యుల ఆర్థిక సహాయంతో పులిహోర, స్వీట్లు, అరటిపండు, మంచినీళ్ల ప్యాకెట్లు వంటి ఆహార పదార్థాలు, వస్త్రాలు పంపిణీ చేసినట్లు సమితి వ్యవస్థాపక అధ్యక్షులు రెడ్డి సురేష్ శర్మ తెలిపారు.బుధవారం ముఖ్యఅతిథి కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు కర్రి తినాధ రెడ్డి(అన్నయ్య) చేతుల మీదుగా పంపిణీ చేసినట్లు సురేష్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ శర్మ మాట్లాడుతూ పితృదేవతలకు భక్తిగా ఆహారాన్ని అందించి వారి ఆకలి తీర్చడమేనని ఈ దానధర్మాలు గతించిన పెద్దలకు సర్గతులు సిద్ధించడం కోసం మహాలయ పక్షం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి రెడ్డి సతీష్, నాగదేవరబాలాజీ శర్మ, కర్రి పాండురంగారెడ్డి, కొవ్వూరి భీమేశ్వర్ రెడ్డి, పడాల విజయ భాస్కర్ రెడ్డి, టి అరుణ్ కుమార్, కె శ్రీనివాస్, ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం పోలీస్ స్టేషన్ సెంటర్లోగల శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారి సన్నిధిలో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఆలయం వద్ద శ్రీ వరసిద్ధి వినాయకుని ప్రతిష్టించి నవరాత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించి భారీ ఊరేగింపుగా మురమళ్ళ వృద్ధ గౌతమి గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, యువత, ప్రజలు పాల్గొన్నారు.

వసతి గృహ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

విశాలాంధ్ర- పెరవలి : కానూరు ఎస్సీ బాలుర వసతి గృహంలో బుధవారం హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం నుండి వచ్చిన దుప్పట్లను, స్టేషనరీ నోట్ బుక్స్, పెన్నులు తదితర పరికరాలు సుమారు 80 మంది విద్యార్థులకు సర్పంచ్ భావన మధు పూర్ణ చందు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లా డుతూ ప్రభుత్వం ఇస్తున్న సదుపాయాలను వినియోగించుకుంటూ బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కోరారు. హాస్టల్ వార్డెన్ వినోద్ రావు పాల్గొన్నారు.

తూర్పు గోదావరి జిల్లా కళాకారులకు గుర్తింపు కార్డుల జారీ

విశాలాంధ్ర -రాజమహేంద్రవరం రూరల్ : తూర్పు గోదావరి జిల్లాలోని కళాకారులు గుర్తింపు కార్డులు జారీ నిమిత్తం అక్టోబరు 7వ తేదీలోపు తమ వివరాలను రాజమహేంద్రవరం జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయానికి పంపాలని జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి సిహెచ్.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కళాకారులకు నూతన గుర్తింపు కార్డు జారీ చేసేందుకు నిర్ణయించిందని, ఆమేరకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ టి. విజయకుమార్ రెడ్డి దరఖాస్తులు స్వీకరించాలని తెలియజేశారని తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కళాకారులు తమ పేరు, ఫోటో, పుట్టిన తేదీ, బ్లడ్ గ్రూప్, కళారూపం, ఎన్ని సంవత్సరాల అనుభవం, ఆధార్ నెంబరు, చిరునామా, ఫోను నంబరు, పూర్తి చిరునామా తదితర వివరములతో ఎ4 సైజ్ కాగితంపై స్పష్టంగా తెలిసే విధంగా నమోదు చేసి ఈ కార్యాలయ చిరునామాకు పోస్టు ద్వారా పంపాలని ఆయన తెలిపారు. ఇతర వివరాల కోసం కార్యాలయ పని వేళల్లో కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు. అక్టోబరు 7వ తేదీ లోగా జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయానికి దరఖాస్తులు పంపాలని డిఐపిఆర్ సిహెచ్.శ్రీనివాస్ తెలియజేసారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం

విశాలాంధ్ర-టి నరసాపురం: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బి. సురేంద్ర కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం నుండి ప్రజా పంపిణీ రేషన్ బియ్యంను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో కామవరపుకోట సివిల్ సప్లై డిటి మొహద్దీన్ తో కలిసి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా సిద్దిపేట మండలం ఇందిరానగర్‌కు చెందిన మహమ్మద్ జమాలుద్దిన్, అయిత కృష్ణలు పిడిఎస్ బియ్యం ను ఎటువంటి అనుమతులు లేకుండా, అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని వారి వద్ద నుండి 20 టన్నుల రేషన్ బియ్యం లారీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

చల్లపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చల్లపల్లి గ్రామ పంచాయతీలో బుధవారం ఆ గ్రామసర్పంచ్ ఇసుక పట్ల జయమణి రఘుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్ని వ్యాదులకు అధునాతన యంత్రాల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు సరఫరా చేసారు. వైద్యాధికారులు డాక్టర్ లోవసుధ, డాక్టర్ సమ్మమ్, డాక్టర్ మనోహర్, కిరణ్, డాక్టర్ లక్ష్మి ప్రసన్న, ఆరొగ్య విస్తరణా ధికారి విప్పర్తి ప్రసాద్, ఐసిడిఎస్ సూపర్వైజర్ కే లీలావతి, జడ్‌పిటిసి గెద్దం సంపద రావు, ఎంపిటిసి భోగిశెట్టి సత్యవతి, నర్సింగ్ వైస్ సర్పంచ్ చీకురు మిల్లి నరసింహారావు, ఎంపీడీవో కె విజయ ప్రసాద్, ఇఒ పిఆర్‌డి కేస్ గౌరి కుమారి, పంచాయతి సెక్రటరీ పెట్టా నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. ఉప్పలగుప్తంలో గురువారం జరుగు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేరాయి చెరువు ఎంపిపి పాఠశాల వద్ద జరుగుతుందని ఎండిఓ కెవి ప్రసాద్ తెలియజేసారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి జగనన్నకు చెబుదాం

విశాలాంధ్ర-బుట్టాయిగూడెం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి జగనన్నకు చెబుదాం కార్యక్రమం మరింతగా దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అన్నారు. బుధవారం బుట్టాయిగూడెం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన బుట్టాయిగూడెం మండలానికి సంబంధించిన జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీలను జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ స్వీకరించారు. జిల్లా కలెక్టర్ వారితో పాటు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి, ఐటిడిఏ పివో యం. సూర్యతేజ, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ, జెడ్పి సిఇఓ కె. రవికుమార్, ఆర్డీవో ఝాన్సీరాణి ,ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జగనన్నకు చెబుదాం స్పందనలో వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుట్టాయిగూడెంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందనలో 155 అర్జీలు అందాయని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దారు ఎస్.ఎస్. శాంతి, యంపిడివో వేణుగోపాల్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర-దేవరపల్లి : ఆరోగ్య పరిరక్షణ కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష ఎంతో దోహదపడుతుందని గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే తలారి వెంకటరావు అన్నారు. దేవరపల్లిలో బుధవారం గ్రామ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటరావు మాట్లాడుతూ వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఏఎంసీ చైర్మన్ గన్నమణి జనార్దన్ రావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, సర్పంచ్ కడిమి వీర కుమార, జడ్పిటిసి పొట్టి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల సంక్షేమానికి నాగేంద్రనాథ్ కృషి అనిర్వచనీయం

విశాలాంధ్ర - కలిదిండి: అన్నదాతల సంక్షేమానికి ఎర్నేని నాగేంద్రనాథ్ కృషి అనిర్వచనీయమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బుధవారం మండలంలోని కొండూరు గ్రామంలో నాగేంద్ర నాథ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర రైతాంగ సమాఖ్య అధ్యక్షులు, డ్రైనేజీ బోర్డు మెంబర్, కేడీసీసీ డైరెక్టర్ గా సుదీర్ఘకాలం పాటు సేవలందించిన నాగేంద్రనాథ్ మృతి బాధాకరమన్నారు. అన్నదాతలకు అండగా ఉన్న ఆయన మృతి రైతన్నకు తీరని లోటు అని తెలిపారు. ఆయన భార్య సీతాదేవి మరియు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ మంత్రులు కామినేని శ్రీనివాస్, నెట్టెం. రఘురాం, మాజీ ఎంపీ కొనగళ్ళ .నారాయణ, పొలిట్ బ్యూరో సభ్యులు టి. డి జనార్ధన్, పైడిపాటి. శివశంకర్, లావేటి. వీర శివాజీ, వేంపాటి. విష్ణు పుల. రాజి, బి కె ఎం నాని తదితరులు పరామర్శించారు.

రోజాపై బండారు అనుచిత వ్యాఖ్యలకు నిరసన

విశాలాంధ్ర-టి నరసాపురం: మంత్రి రోజా పై టిడిపి నాయకులు బండారు సత్యనారాయణ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మండల వైఎస్సార్ సీపీ నాయకులు భూక్యా వేణుగోపాల్, ధరావత్ రమేష్ ఆధ్వర్యంలో టి నరసాపురం పంచా యతీ కృష్ణాపురంలో బుధవారం నిరసన ప్రదర్శనలు చేసి బండారు సత్యనారాయణ వ్యాఖ్యానాలను ఖండించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ స్త్రీలను గౌరవించడం భారతీయ సాంప్రదాయం అన్నారు. బండారు సత్యనారాయణపై చట్ట పరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళల రక్షణ కోసం చేసిన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భూక్యా రమేష్, జరబల రామకృష్ణ, భూక్య కృష్, హసావత్ వెంకటేశ్వరరావు, భూక్య బాబురావు, లావుడియా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - కిర్లంపూడి : రాష్ట్రంలో ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మండల కేంద్రమైన కిర్లంపూడి కొక్కొండ రామ శేషగిరి పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కిర్లంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాంబాబు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, కిర్లంపూడి ఎంపిపి తోట రవి, ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతీ ఇంటికి వెళ్ళి ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే అన్నారు. ఈ కార్యక్రమంలో జగపతినగరం సర్పంచ్ మహేంద్రాడ శ్రీలతారాంబాబు, కిర్లంపూడి ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నిర్దోషని వైసీపీకి తెలుసు

విశాలాంధ్ర - కాకినాడ సిటీ : 14 ఏళ్లపాటు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్, ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన నారా చంద్రబాబు నాయుడు నిర్దోషని అధికార వైకాపా వారికి తెలుసని అతన్ని కావాలనే అక్రమంగా కేసుల్లో ఇరికించి జైలు పాలు చేశారని, మంత్రి రోజాకు చెందిన వీడియో ఫిలిం ఎవరు బయటకు విడుదల చేశారో వారిని అరెస్ట్ చేయాలని లేని పక్షంలో వచ్చే తమ టీడీపీ ప్రభుత్వం న్యాయం చేస్తుందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. ఈ సందర్భంగా కాకినాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ తమ పార్టీ అధినేత చంద్రబాబును కావాలనే అన్యాయంగా అక్రమంగా జైలు పాలు చేసి వారంతా వికృత ఆనందం పొందుతున్నారన్నారని అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు అనిశెట్టి సత్యనారాయణ రెడ్డి, దేవరపల్లి రామారావు, బర్లంకి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

లెప్రసి ఎయిడ్స్, టిబి కంట్రోల్ కార్యాలయంలో వివిధ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టీబీ కంట్రోల్ అధికారి వారి కార్యాలయ పరిధిలో ఎన్ హెచ్ఎంఎన్ టిఇపి స్కీంలో భీమవరం జిల్లాలో ఒక మెడికల్ ఆఫీసర్ (డిటిపిసి), ఒక ఎడ్యూకేట్ ఆఫీసర్, ఒక పిపిఎం కో-ఆర్డినేటర్, ఒక ఎక్కౌంటెంట్, ఏలూరు జిల్లాలో ఒక జిల్లా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్, ఒక సీనియర్ డిఆర్ టిబి-టిబిహెచ్ ఐవి సూపర్ వైజర్, ఉమ్మడి జిల్లా పరిధిలో పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ జి. రత్నకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వారి దరఖాస్తులను ఈనెల 9వ తేదీ సాయంత్రం గం.5లోపు కార్యాలయ పని దినాలలో ఏలూరులోని జిల్లా క్షయ వ్యాధి నివారణ కార్యాలయంలో అందజేయాలన్నారు.